



ప్రతాప రవిశంకర్

ఆ గదిలో ఉన్న ప్రాణిలాగే రెపరెపా కొట్టుకుంటూంది గూట్లో వెలుగుతున్న దీపం. ఆ ప్రాణి కళ్ళు మూయగానే యమభటులు కళ్ళముందు కనిపించి భయపెట్టినట్లు తెరిచి ఉన్న తలుపుల్లోనించి, కిటికీల్లోనించి లోపలకు వస్తున్న గాలి దీపాన్ని భయపెడుతూంది.

గోడవారగా వాల్చి ఉన్న కుక్కి మంచంలో ఎండిపోయిన శవంలా ముడుచుకు పడుకుని ఉంది కామేశ్వరమ్మ. దీపం కాంతిలో ఆమె కళ్ళు తెరుచుకుని ఉన్నాయో, మూసుకు ఉన్నాయో తెలియటం లేదు. ఎంతో పరీక్షగా చూస్తేగాని ఆమె కళ్ళు మూసుకుందని తెలియదు. కుళ్ళిపోయిన సపోటా పండు తోలులా ఆమె ముఖం ముడతలు ముడతలు పడిపోయింది. ఆమె ఎముకల మీద చర్మం ఉన్నదో లేదో చెప్పడం చాలా కష్టం. ఆమె ఒంట్లో ఉన్న ఎముకలను సులభంగా లెక్కపెట్ట వచ్చు. బలపాల్లాంటి కాళ్ళు, చేతులు. కుడిచేతికి ఓ గాజు అంటుకుపోయి ఉంది. అది ఏ లోహంతో చెయ్యబడిందో తెలుసుకోవడానికి కొన్ని పరీక్షలు చెయ్యవలసి ఉంటుంది. ఆమె దవడలు ఎవరో బలవంతంగా లోపలకు లాగి నొక్కిపట్టినట్లు ఒకదాని నొకటి అంటుకుపోయాయి. ఆమె ఇంకా బ్రతికే ఉన్నదనటానికి నిదర్శనంగా వీపు నంటుకు పోయిన పొట్ట పైకీ, క్రిందికీ కదుల్తూంది— ఎవరో బెలూన్‌లోకి గాలి ఊది, వదులుతున్నట్టుగా.

శవంకోసం కాచుకున్నట్లు పక్కల్లా ఆమె మంచం చుట్టూ కూర్చున్నారు సుభద్రమ్మ, ఆమె కొడుకు రామభద్రం, ఇంకా చుట్టుపక్కల ఇళ్ళలో కాపుర ముంటున్న అయిదుగురు ఆడవాళ్ళు. వారందరూ కామేశ్వరమ్మ చావు గురించి చర్చించుకుంటున్నారు.

"ఎక్కడ పుట్టిందో, ఎక్కడ పెరిగిందో మహాతల్లి? చివరికి ఇక్కడ ప్రాణాలు వదలబోతోంది. ఎవరి చావు ఎక్కడ రాసిపెట్టి ఉందో ఎవరి కెరుక!" ఏళ్ళైపోయి పసుంధరమ్మ వేదాంత ధోరణిలో అన్నది.

"నిజమే. రేపు మనందరం ఎక్కడ రాలిపోతామో తెలియదు గదా?" అన్నది సుభద్రమ్మ గొంతులో కొంచెం విచారాన్ని మేళవించి.

రామభద్రం కూడా ఏదో మాట్లాడబోయాడు. కాని, అతను నోరు తెరిచే లోపలే కామేశ్వరమ్మ చిన్నగా మూలిగింది. ఆటు తర్వాత శవం కదిలినట్లు కొంచెంగా కదిలింది. అందరూ ఆత్రతగా ఆమె వంక చూశారు. రామభద్రం లేచి వెళ్ళి గూట్లో ఉన్న దీపం బుడ్డికి చెయ్యి అడ్డం పెట్టి నెమ్మదిగా మంచం దగ్గరకు తీసుకు వచ్చాడు.

అప్పుడే కనులు తెరిచే ప్రయత్నం చేస్తున్న కామేశ్వరమ్మ దీపం వెలుతురు కళ్ళమీద పడగానే రెండు కళ్ళను గట్టిగా మూసుకుంది. వెంటనే ఎవరో ఒకామె రామభద్రానికి సైగ చేసింది, దీపాన్ని గూట్లో పెట్టి రమ్మని.

కామేశ్వరమ్మ ఏదో మాట్లాడాలని ప్రయత్నం చేసింది. కాని, ఆమె నోరు పెగల్లేదేమో — మాట్లాడలేకపోయింది. ఆమె ప్రయత్నాన్ని గ్రహించిన సుభద్రమ్మ కామేశ్వరమ్మ ముఖం మీదికి వంగి, "ఏమిటి, అక్కయ్యా, ఏం చెప్పాలనుకుంటున్నావు? చెప్పు" అన్నది కొంచెం పెద్దగా.

రెండు నిమిషాల తర్వాత కామేశ్వరమ్మ ఎట్లాగో గొంతు పెగుల్చుకుంది. "అయితే, రాము ఇంక నా కంటికి కనిపించ డంటావా?" అని సన్నగా గొణుగుతున్నట్లు అడిగింది.

ఆ మాట విని రామభద్రం తల్లి ముఖంలోకి చూశాడు. ఆమె ముఖంలో ఎలాంటి భావం గోచరించలేదు. అతని చూపును గ్రహించినట్లు చూసింది.

మళ్ళీ అదే మాటను గొణిగింది కామేశ్వరమ్మ.

"ఏమే! రాముడిని ఇక నేను చూడలే నంటావా?"

"ఇంకెక్కడి రాముడు, అక్కయ్యా! వాడు నిన్ను ఎప్పుడో మరిచిపోయి ఉంటాడు. లేకపోతె కన్నతల్లి ఏమైపోయిందో నన్న ధ్యాసైనా లేకుండా ఉంటాడా? అనవసరంగా వాడి గురించి ఆలోచించి చివరి గడియల్లో మనసు కష్టపెట్టుకోకు ... నీకేం కావాలో చెప్పు. ఇదిగో, నా కొడుకు రామభద్రం ఉన్నాడు. వీడినే నీ కొడుకు రాముడనుకో" అన్నది.

"అవును, పిన్నీ! నీ చివరి కోరిక ఏమిటో చెప్పు. నేను తీరుస్తాను. నన్నే నీ కొడు కనుకో, పిన్నీ" అన్నాడు రామభద్రం, తల్లి పక్కకి వచ్చి.

"అంతే నంటావా? నా రాముణ్ణి కడసారి చూడలే నంటావా? రాముడూ... ఒరేయ్, రాముడూ ..." అంటూ మళ్ళీ మగతలోకి జారుకుంది కామేశ్వరమ్మ.

"పాపం! చివరి క్షణాల్లో ఎందుకు రాముడు ఇక తిరిగి రాడని ఆమె మనసును కష్టపెట్టడం? వస్తాడంటే సరిపోదూ?" అన్నది వసుంధర నొసలు చిట్లించి.

"చివరి క్షణాలు కాబట్టే ఖచ్చితంగా చెప్పవలసి వచ్చింది. లేకపోతే వాడు వస్తాడనే ఆశతోనే ప్రాణాలు వదలదూ? ఆశ తీరకపోగా ఆశ పెట్టిన పాపం మనకు చుట్టుకుంటుంది. అయినా, ఈమె వెర్రిగాని రాము ఇంకా ఎక్కడ తిరిగి వస్తాడు? వాడు ఎప్పుడో ఈమెను మరిచిపోయి ఉంటాడు" అన్నది సుభద్రమ్మ.

ఆటు తర్వాత ఎవరూ మాట్లాడలేదు. ఆ గదిలో శ్మశాన నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. దూకుడుగా లోపలకు వస్తున్న గాలి గూట్లో దీపాన్ని భయపెడుతూనే ఉంది. దీపం భయపడుతూనే ఉంది.

కామేశ్వరమ్మ మొదటనుంచి దిక్కులేనిది కాదు. ఆమెను కన్న తల్లితండ్రులు ఆమె పెళ్ళి చేసిన పదేళ్ళకే కాలం చేశారు. ఆమెకు తోబుట్టువులు లేరు. పెళ్ళయిన ఆరేళ్ళవరకూ కామేశ్వరమ్మకు సంతానం కలగలేదు. సంతానం కోసం ఎన్నో నోములు నోచింది. ఎంతమంది దేవుళ్ళనో ప్రార్థించింది. చివరికి ఆమె నోములు ఫలించి, ఆ దేవుళ్ళు కామేశ్వరమ్మ మొరను ఆలకించినట్లు ఆమె కడుపు పండింది. కొడుకు పుట్టాడు. వాడికి రామచంద్రమూర్తి అని పేరు పెట్టుకుంది. భద్రాచలం నించి రాగానే వాడు కడుపున పడ్డాడట. అందుకే భర్తతో పోట్లాడి ఆ పేరు పెట్టుకుంది. భర్త తన తండ్రి పేరు పెడదామనుకున్నాడు. కాని, అందుకు ససేమిరా ఒప్పుకోలేదు కామేశ్వరమ్మ. చివరికి తన పంతమే నెగ్గించుకుంది. ఆపైన కామేశ్వరమ్మ కడుపున మరో ఆడపిల్ల పుట్టింది గాని, పుట్టిన మూడేళ్ళకే నూరేళ్ళు నిండినట్లు వెళ్ళిపోయింది. తర్వాత కామేశ్వరమ్మకు సంతానం కలగలేదు. ఒక్కడే కొడుకని రాముడిని గారాబంగా పెంచింది. ఆ గారాబమే వాడిని ఎందుకూ పనికిరాని వాడిని చేసింది. వాడు కోరిందల్లా కొని ఇచ్చింది. వాడు బడికి వెళ్ళనని మొరాయిస్తే బడి మాన్పించింది. ఇంటికి దగ్గరే ప్రైవేటు పెట్టించింది. కాని, వాడుమాత్రం కొంచెం కూడా చదువు పట్టించుకోలేదు. పైగా పంతులుగారితో దెబ్బలాడేవాడు. ఆ దెబ్బతో 'వీడికి చదువు చెప్పడం కంటే బండరాయికి చెప్పడం సులభం' అని కామేశ్వరమ్మ ఇంటికి రావడం మానుకున్నారు పంతులుగారు.

క్రమంగా పెరిగి పెద్దవా డయ్యాడు రాముడు. స్నేహితులతో కలిసి గుళ్ళో కూర్చుని, పొలాల గట్లమీద కూర్చుని సిగరెట్లు తాగడం అలవాటు చేసుకున్నాడు. వాటితోబాటు మరెన్నో దురలవాట్లను నేర్చుకున్నాడు. ఇంట్లో దొరికిన ప్రతి వస్తువునీ అమ్ముకోవడం మొదలు పెట్టాడు. తండ్రి ఎన్నోసార్లు వాడిని చిదక దన్నాడు. అయినా, వాడి బుద్ధి రవంతకూడా మారలేదు. ఒక సారి ఆ ఊళ్ళోనే ఒకరి ఇంట్లో దొంగతన

జరిగింది. కొన్ని నగలూ, డబ్బూ పోయాయి. అమాకీ తీయుగా ఆ దొంగ ... చేశాడని తెలిసింది. ఆ ... వాళ్ళంతా రాముడికోసం వెదికారు. కాని, వాడు ఎప్పుడో పరారీ అయినాడు. కామేశ్వరమ్మ కుమిలి కుమిలి ఏడ్చింది ఎట్లాగైనా తన రాముడిని మంచివాడిని చేసి తన దగ్గరకు చేర్చమని దేవుళ్ళను ప్రార్థించింది. ఈ సారి ఏ దేవుడూ కామేశ్వరమ్మ ప్రార్థనను వినలేదు. రాముడి జాడ తెలియలేదు ఇక ఆ ఊళ్ళో తల ఎత్తుకుని తిరగలేక కామేశ్వరమ్మను తీసుకుని ఆ ఊరికి చాలా దూరంలో ఉన్న మరో ఊరికి వచ్చి స్థిరపడిపోయాడు ఆమె భర్త. ఆ తర్వాత మరో ఐదేళ్ళకు ఆయన ఈ లోకం నించే వెళ్ళిపోయాడు. కామేశ్వరమ్మ దిక్కులేనిదై పోయింది.

"డాక్టర్ని పిలుచుకువస్తే బాగుండును" అన్నది, చుట్టూ కూర్చున్న నలుగురిలో ఒకావె.

వెంటనే సుభద్రమ్మ అందుకుంది: "అవసాన దశలో కావలసింది డాక్టరు కాదు. ఏ డాక్టరూ పోయే ప్రాణాన్ని ఆపలేడు. ఈ అంతిమ క్షణాల్లో ఆమెకు గొంతులో ఇన్ని నీళ్ళు పోసేందుకు కొడుకు కావాలి. ఏం చేస్తాం? కామేశ్వరమ్మ అక్కయ్య దురదృష్టవంతురాలు. రాముడు కావలసిన సమయంలో దగ్గర లేకుండా పోయాడు. పోనీలే. మా రామభద్రాన్నే రాము డనుకుని ఇన్ని నీళ్ళు పోయిద్దాం" అన్నది కంటతడిని తుడుచుకుంటూ.

ఎవ్వరూ మాట్లాడలేదు. ఎవరికి వారే మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్నారు.

కామేశ్వరమ్మ మరోసారి చిన్నగా మూలిగింది. ఆ తరవాత సన్నగా — "రాముడూ! నా రాముడూ . . . ఒక్క సారి కనిపించవా, నాయనా ..." అని ఎంతో సన్నగా గొణిగింది. అక్కడ ఉన్న వారందరి కళ్ళూ ఆమె మీదే ఉన్నాయి. అలా గొణుగుతూనే ఆమె మగతలోకి జారుకుంది.

'పాపం! ఆ ముసలి ప్రాణం కొడుకు కోసం ఎంత తల్లడిల్లిపోతూందో!" అన్నది సుభద్రమ్మ కొండంత విచారంతో.

"కాదు, మరి? ఎన్నేళ్ళయిందో కొడుకుని చూసుకుని! అసలు ఇన్నాళ్ళూ కొడుకు తిరిగి వస్తాడనే ఆశతోటే ప్రాణాలను నిల్పుదిస్తోంది. పాపం, ఎంత మమకారమో! ఏ జన్మలో ఏ తల్లీ కొడుకులను విడదీసిందో — కడుపుకోత అనుభవిస్తోంది" అన్నది మరో ఆమె. అందరూ తమకు తోచిన మాటల్ని గురించి, పెద్దతనంలో కామేశ్వరమ్మ అనుభవిస్తున్న శోకాన్ని గురించి మాట్లాడుకుంటున్నారు.

గూట్లో దీపం రెపరెప లాడుతూంది. కామేశ్వరమ్మ ప్రాణం గుటగుట లాడుతూంది.

వాచీ వంక చూసుకున్నాడు రామభద్రం.

"ఎంతయిందిరా టైము?" అడిగింది సుభద్రమ్మ.

"పది" అన్నాడు గట్టిగా.

"అయ్యో! అప్పుడే పది గంట లయిందా? ఇంటి దగ్గర పిల్లలు, ఆయన ఎదురుచూస్తూంటారు. భోజనాలు పెట్టలేదు" అంటూ లేచింది ఓ నడివయసు ఆవిడ.

మిగిలిన వారూ లేచారు.

"భోజనాలు చేసి వస్తాము, సుభద్రమ్మ వదినా. అందాకా నువ్విక్కడే కూర్చుంటావుగా?" అని అడిగారు.

"ఆ! ఈ స్థితిలో కామేశ్వరమ్మ అక్కయ్యను వదిలి ఎట్లా పోతాము? మీరు వెళ్ళి రండి. ఇంటి దగ్గర పిల్లలు ఎదురుచూస్తూంటారు" అన్నది.

వాళ్ళందరూ వెళ్ళిపోయారు. రామభద్రం కూడా లేచి నిలుచున్నాడు.

"త్వరగా నాలుగు మెతుకులు గొంతులో వేసుకొని వచ్చేయ్. మళ్ళీ ఆ గుంపు వస్తుంది" అన్నది చిన్నగా సుభద్రమ్మ.

తల ఊపుకుంటూ వెళ్ళిపోయాడు రామభద్రం.

కొడుకు వెళ్ళిపోగానే సుభద్రమ్మ గూట్లో వెలుగుతున్న దీపం బుడ్డిని మెల్లగా తీసుకువచ్చి ఆ వెలుతురులో కామేశ్వరమ్మను పరీక్షగా చూసింది. అప్పటికే ఆమె ముఖాన్ని ప్రేత కళ కప్పేసింది. మెల్లగా వణుకుతూంది. కాళ్ళూ చేతులూ సన్నగా కదులుతున్నాయి.

"రాముడూ ... రాముడూ ..." అంటున్నట్టు కామేశ్వరమ్మ పెదవుల కదలిక బట్టి గ్రహించింది సుభద్రమ్మ. సన్నగా నవ్వుకుంది. దీపం బుడ్డిని తిరిగి గూట్లో పెట్టి వచ్చి మంచం పక్కగా కూర్చుంది.

నిమిషాలు యుగాలుగా గడుస్తున్నాయి.

'ఈ రామభద్రం వెధవ ఎంతసేపటికీ వచ్చి చావడేం?' అనుకుంది. మనసులోనే కొడుకుని తిట్టుకుంది సుభద్రమ్మ



పది నిమిషాల తర్వాత గబగబా వచ్చాడు రామభద్రం. అతని చేతిలో ఏవో కాగితాలు ఉన్నాయి.

"మొద్దూ! ఇంత ఆలస్యం చేశావేం?" అన్నది కోపంగా సుభద్రమ్మ.

"నా స్నేహితు డొకడు వచ్చాడు. వాడిని పంపించి వస్తున్నాను" అన్నాడు చిన్నగా.

"సర్లే. తలుపు మూసి ఇటు రా" అన్నది. అతను తల్లి పక్కగా వచ్చాడు. కామేశ్వరమ్మ చేతులు ఇంకా వణుకుతూనే ఉన్నాయి. సుభద్రమ్మ వణుకుతున్న చేతిని గట్టిగా పట్టుకుంది. రామభద్రం కామేశ్వరమ్మ బొటన వ్రేలికి సిరా పూశాడు. ఆ వ్రేలును తను తెచ్చిన కాగితాల మీద అడుగున గట్టిగా నొక్కాడు. కామేశ్వరమ్మ వేలిముద్ర పడింది. వెంటనే సుభద్రమ్మ కామేశ్వరమ్మ చేతిని కొడుకు చేతిలో ఉంచి గబగబా వెళ్ళి వంటింట్లో కుండలో ఉన్న నీళ్ళలో పమిట కొంగును తడుపుకుని వచ్చి కామేశ్వరమ్మ వ్రేలికి అంటిన సిరాను శుభ్రంగా తుడిచివేసింది. రామభద్రం ఆ కాగితాలను మడిచి జేబులో పెట్టుకున్నాడు. తరవాత ఇద్దరూ ఆ ఇంటిని సోదా చేశారు. తుప్పుపట్టిన ఇనప్పెట్టెను తెరిచింది సుభద్రమ్మ. పాత బట్టల అడుగున ఏభై రూపాయలు కనిపించాయి. గబగబా వాటిని అందుకొని రామభద్రం చూడకుండా జాకెట్టులో దాచుకుంది.

ఇంతలో రామభద్రం రెండు ఇత్తడి గిన్నెలను చేత పుచ్చుకుని వచ్చాడు. "త్వరగా దొడ్డిదోవన వెళ్ళి ఇంట్లో పడేసిరా. పో." తొందరచేసింది సుభద్రమ్మ.

గిన్నెలను ఇంట్లో పడేసి రెండు నిమిషాల తర్వాత వచ్చాడు రామభద్రం.

ఇద్దరూ కామేశ్వరమ్మను చూశారు. గిలగిలా కొట్టుకుంటూంది. యమ భటులతో పోరాడుతున్నట్లు కనిపించింది.

వెంటనే సుభద్రమ్మ దొడ్లోకి వెళ్ళి తులసి కోటలో ఉన్న తులసి మొక్క ఆకులను గబగబా తుంచుకుని వచ్చింది. చిన్న గ్లాసుతో నీళ్ళు తెచ్చి తులసి ఆకులను నీళ్ళలో వేసింది.

ఇంతలో ఆ వీధిలో నాలుగిళ్ళ వాళ్ళూ తలుపులు నెట్టుకుని లోపలకు వచ్చారు.

"రండి. కామేశ్వరమ్మ అక్కయ్య మన న్దరినీ వదిలి వెళ్ళిపోతోంది" అన్నది సుభద్రమ్మ ఏడుస్తూ.


సుభద్రమ్మ రెండు చేతులతో కామేశ్వరమ్మ నోటిని తెరిచింది. నోట్లో తులసి నీళ్ళను మెల్లగా పోశాడు రామభద్రం. సుభద్రమ్మ "రామ ... రామ" అన్నది పెద్దగా.

రామభద్రం పోసిన నీళ్ళను కామేశ్వరమ్మ మింగలేదు. గుటక వెయ్యకుండానే గుటుక్కుమంది. నోట్లో నీళ్ళన్నీ బయటకు వచ్చాయి. తల వాల్చింది కామేశ్వరమ్మ. తొమ్మిదేళ్ళ క్రితం తన కొడుకు ఓ రైలు ఏక్సిడెంటులో చచ్చిపోయాడనీ, అతని శవం ఎవరూ గుర్తు పట్టటానికి వీల్లేనంతగా నజ్జునజ్జయిపోయిందనీ తెలియకుండానే పోయింది కామేశ్వరమ్మ.

"కామేశ్వరమ్మక్కయ్యా!" ఒక్కసారి బావురుమంది సుభద్రమ్మ, ఆమె శవం మీద వాలుతూ.

"పిన్నీ! కొడుకుని కనికూడా నా చేతుల మీదుగా పోవలసి వచ్చిందా?" అని ఏడుపు లంకించుకున్నాడు రామభద్రం.

అక్కడ చేరినవా రందరూ పమిట చెంగులతో, పై పంచలతో కళ్ళను వత్తుకున్నారు. వా రందరి కళ్ళముందు కామేశ్వరమ్మ శవం దీనంగా కనిపించింది. కాని, సుభద్రమ్మ కళ్ళకు, రామభద్రం కళ్ళముందు కామేశ్వరమ్మ తాలూకు అయిదెకరాల మెట్ట భూమి, ఆ ఇల్లు కదులుతున్నాయి. వా రిద్దరి హృదయాలు సంతోషంతో ఎగిరిపడుతున్నాయి. కాని, అసలు విషయం వాళ్ళకు తెలియదు. మొదటినుంచీ సుభద్రమ్మ, రామభద్రం తన ఆస్తిని తన్నుకుపోవటానికి గద్దల్లా కాచుకున్నారని కామేశ్వరమ్మ అనుమానిస్తోందని వాళ్ళకు తెలియదు. అందుకే కాలూ, చెయ్యీ ఆడుతున్నప్పుడే తనకు తెలిసిన ప్లీడర్ని కలుసుకుని, తన కున్న పొలాన్ని, ఇల్లునీ తన కొడుకు రాఘుడు పేర వ్రాయించిందనీ, ఒకవేళ వాడు నాలుగేళ్ళ లోపుగా తిరిగి రాకపోతే ఆ ఆస్తి యావత్తూ ఆ ఊరి రామాలయానికి చెందేటట్టు విల్లు రాసిందనే నిజం పాపం! సుభద్రమ్మకీ, రామభద్రానికీ తెలియదు. *

MPIC-22